
# ప్రేమించు ప్రేమకై



ఆ ప్రాంత మంతా పచ్చనిచెట్లు, రంగురంగుల పూలు గాలికి నిత్యం రాలిపడే ఎండుటాకులు. యువతీయువకుల మనోభావాలకు కొత్త అర్థాలు చెప్పే వాతావరణం. కాలేజి కేంపస్ అంటేనే అబ్బాయిలు, అమ్మాయిల కోలాహలం ఒకటే సందడి. జట్లు జట్లుగా, జంటలుగా, ఎవరికి వారు ప్రేమపాఠాలు వల్లించుకుంటున్నారు.

"మనం యిలా ఎంతకాలం రహస్యంగా కలుసుకుంటాం" సహనం భరించలేని వాడిలా శ్రీకాంత్ రమ్యను ప్రశ్నించాడు.

"ఈ రెండేళ్ళు యూనివర్సిటీలో చేరింది నీ కోసమేగా "అంది రమ్య రసమయంగా.

"గడిచిపోయిందిగా త్వరగా డిసైడ్ చేయి " అన్నాడు.

శ్రీకాంత్, యిక ఎంత మాత్రం ఎడబాటు సహించలేనివాడిలా మా డాడీ ఎలాగూ

ఒప్పుకోరు. మమ్మీతోనే మాట్లాడాలి.వస్తారా".

" ఏం మాట్లాడమంటావ్. అసలు ఒప్పుకుంటారా,నా వెనుక నాకేంవుందని, పల్లెటూళ్లో చిన్న ఇల్లు, రిటైర్డ్ ఫాదర్, వోల్డ్ మదర్, హైదరాబాద్‌లో చిన్నజాబ్, నిన్నుమాత్రం నాగుండెల్లో దాచుకుంటాను ఓకే " అన్నాడు శ్రీకాంత్ ఎంతో ఉద్వేగంతో ప్రేమంతా ఒలకబోస్తున్నట్లు.

" నా పెళ్ళి కోసం పాతిక లక్షలు బ్యాంక్‌లో దాచారు మావాళ్ళు. గోల్డ్ గంపెడుంది. మాకు మూడు అపార్ట్‌మెంటులున్నాయి. అందులో నాదొకటి. నీకోసం ఇవన్నీ వదులుకోవడానికి సిద్ధంగా వున్నాను. తెలిసిందా" అని రమ్య తన హోదా, హుందాతనం, అహంభావం అన్నీ తన మాటల్లో చూపుతూ, శ్రీకాంత్ గతుక్కుమన్నాడు తన ప్రేమని ఎక్కడ కాదంటోందనని చుట్టూ చూసాడు. చాలా జంటలు కనిపించాయి. లేకపోతే పాదాక్రాంతుడయ్యేవాడు. బంగారుబాతు ఒళ్ళోకి రాలుతుంటే అంత తేలిగ్గా వదిలేయడమా అని అనుకున్నాడు లోలోన. ముఖంలో, నడతలో ఎలాంటి అనుమాన పు ఛాయలు కనపడకుండా జాగ్రత్తపడ్డాడు.

" రమ్య మీ గురించి అంతా చెప్పింది,అయినా మా వారు ఒప్పుకోరు "అంది రమ్య తల్లి కమల శ్రీకాంత్‌తో అయిష్టంగా.

శ్రీకాంత్ అసహనంగా అటూయిటూ కదులుతూ రమ్యవైపు చూస్తూ కనుబొమలు ఎగరేసాడు మౌనంగా.

" మమ్మీ....! డాడీ సంగతి పక్కన పెట్టు. నువ్వేమన్నా అడగాలంటే అడుగు" అంది రమ్యతల్లిని మరింత ఒత్తిడికి లోనుచేస్తూ.

' మా అమ్మాయి మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాం" కనుబొమలు చిట్లిస్తూ అంది కమల శ్రీకాంత్ వైపు చూస్తూ.

" మీరు అనుకున్నదానికన్నా యింకా బాగా చూసుకుంటాను" అన్నాడు శ్రీకాంత్ తడుముకోకుండా.

"ఇప్పటివరకు రమ్యకు ఏమీ లోటురానివ్వలేదు అంది మళ్ళీ".

"అవునట చెప్పింది" ముక్తసరిగా జవాబిచ్చాడు.

“ ఎంతో దర్జాగా పెరిగింది. వెండికంచంలో తప్పా మరెందులోను భోజనం చేయలేదు. మీరు కనీసం ప్రేమగా చూసుకుంటే చాలు 'కమల ఒక మెట్టుదిగి - అంటూ రమ్య వైపు చూచింది తన కంట్లో నీళ్ళు సన్నగా చిప్పిల్లాయి.

“ మమ్మీ అవన్నీ ఎందుకు, నువ్వు మా పెళ్ళికి ఒప్పుకున్నట్లే, కదా”అంది రమ్య చురుగ్గా, సూటిగా,

“ అది సరేలే, నువ్వు నన్ను బలవంతంగా ఒప్పించావు. మరి డాడీనెలా ఒప్పిస్తావ్” అని తిరిగి కూతురు మీద పెనుభారం మోపినట్లంది.

“ నేను నిన్నెలా ఒప్పించానో, డాడీని నువ్వు అలా ఒప్పించాలి. లేకపోతే చెప్పానుగా ” ఏదో వార్నింగ్ ఇస్తున్నట్లు సైగచేసింది రమ్య తల్లిని ఉద్దేసింది.

వాళ్ళిద్దరి సంభాషణ మధ్య శ్రీకాంత్ చురుగ్గా కల్పించుకుంటూ ” రమ్య మమ్మీతో అలాగేనా మాట్లాడేది , తప్పుకదూ” అంటూ రమ్యని మందలిస్తుంటే కమలకి కడువింతగా తోచింది. అప్పుడే ఇద్దరు ఒక్కటైపోయారా అంతా అప్యాయత, అనుబంధం ఎప్పుడొచ్చింది. వీళ్ళ బంధాన్నిప్పుడు కాదంటే మొదటికే మోసం వచ్చేటట్లుంది. అని అనుకొని మౌనం వహించింది.

రమ్య శ్రీకాంత్ ఇద్దరూ గది బయట కొచ్చి ఆనందంతో తబ్బిబ్బు అయిపోతూ షేక్ హేండిచ్చుకున్నారు.

నెలరోజుల్లో అతి సింపుల్‌గా ఓ మారుమూల ప్రాంతంలో రమ్యకి, శ్రీకాంత్‌కి కట్నాలు లాంఛనాలు లేకుండా పెళ్ళి జరిపించేసారు. రమ్య తండ్రికి ఈ పెళ్ళంటే ఇష్టంలేదన్న సంగతి శ్రీకాంత్ ఎప్పుడో గ్రహించేసాడు. తన తల్లిదండ్రులకి సరిగ్గా మర్యాదలు జరగకపోయినా సర్దుకుపోయాడు. అయినా తనకి కావలసింది రమ్యతో మూడుముళ్ళు.

పెళ్ళయ్యాక రెండు నెలలకు సరిపడ్డ వస్తుసామాగ్రిని రమ్య ప్యాక్ చేయించుకుంది. వాటితో పాటు చేతిఖర్చులకు ఏభైవేల రూపాయలు ముక్కుపిండి మరి పుచ్చుకుంది. కూతుర్ని ఒక్కర్తేనే కదా అన్న ధీమా ఒలకబోసింది.

దూరమవుతున్న కూతుర్ని చూసి కంటతడిపెట్టుకుంటున్న తల్లిని చూసి రమ్య ఏమాత్రం

సానుభూతి చూపకుండాపైగా ఏడుస్తావెందుకు. నాక్కావలసినవన్నీ మళ్ళీ వచ్చి పట్టుకెల్తాలే" అంటూ ఎగతాళి చేసినట్లు నవ్వింది.

ఆ మర్నాటినుండే ఫోన్‌లో తల్లిని తండ్రిని సతాయించేది.

" నీకు పిల్లలు పుడితేనే గాని ఆ బాధేంటో తెలియదే" అంది కన్నతల్లి ప్రేమను దూరం చేసుకోలేక కమల.

" నువ్వు పెంచుతానంటే పిల్లాడిని కంటాను. కాని నేను ఆ బరువు బాధ్యత మోయలేను" అంది నిర్లజ్జగా.

" మమ్మల్ని అడిగే ప్రేమించి పెళ్ళి చేసుకున్నావా, తీరా పిల్లలు కనడానికి మా పర్మిషన్ కావలసివచ్చిందా, సిగ్గులేదా ఆ మాటలు అనడానికి 'అంటూ కమల నిష్కర్షగా ఫోన్ పెట్టేసింది.

శ్రీకాంత్ ఎటూచెప్పలేక రమ్యను మందలించబోయాడు.

"మీరేం మాట్లాడకండి. మీకేం తెలియదు" అంటూ మంచంమీదకెళ్ళి కూర్చుంది. మా అమ్మతో ఎలా మాట్లాడాలో నాకు బాగా తెలుసు. చంటి పిల్ల చాకిరీ నేనుపడలేను. మమ్మీ దగ్గరే పడేస్తే ఆ తంటాలేవో వాళ్ళే పడతారు. ఇక్కడ నాకో సర్వెంట్ మెయిడ్ కావాలి. దానికయ్యే ఖర్చు మీరెక్కడ్నుంచి తెస్తారు. అదీ మా అమ్మ దగ్గర్నుండే లాగాలి. మనవడు పుట్టాడన్న నెపంతో ఇక్కడ త్రీ బెడ్‌రూమ్ కొనమని పోరుతాను. ఎవరి కోసం కొంటారు. నా కోసం దాచిన కట్నం సొమ్మంతా రాబెట్టుకోవాలావద్దా, ఇప్పుడన్నా అర్థమయ్యిందా నా పట్టుదల దేనికో " అంది రమ్య సీరియస్‌గా" అబ్బో రమ్యా నీస్కెచ్ ముందర నాప్లాన్స్ అన్నీ అట్టర్ ఫ్లాప్ అనుకో" అంటూ బుగ్గలమీద సుతారంగా ముద్దు పెట్టుకున్నాడు సంబరపడిపోతూ శ్రీకాంత్. సిగ్గుల మొగ్గయింది రమ్య.

" ఏమండీ, ఇది విన్నారా, రమ్య సందడి చేసిందంట" అంది కమల భర్తతో ఒక రోజు అకస్మాత్తుగా కూతురు దగ్గర్నుండి ఫోన్ కాల్ వచ్చాక.

" ఆ చెప్పావుగా, దానికేం తక్కువ" అని తేలిగ్గా వెటకారంగా కొట్టిపారేసాడు.

"అదేంటండీ అలా అంటారు, ఎంతన్నా అది కూతురు కదా!

పుట్టబోయేవాడు మీ మనమడు కాకపోతాడా?" అంది భార్య భర్త మాటల్ని ఖండిస్తూ.
" అది నీ తాటతీస్తుంది దాని పిల్లల్నినెత్తిన పెట్టుకుంటానంటే కుదర్దు. పురుడు పోసి అత్తవారింటికి పంపేయ్" అన్నాడు ఖరాఖండిగా తలవిదుల్చుతూ.

ఈయనింతేలే అని చిన్న నిట్టూర్పు విడిచి వూరుకుంది.

రమ్యకు ఆరోనెల రాగానే శ్రీకాంత్ అత్తగారింట్లో దిగబెట్టి వెళ్ళిపోయాడు.

రోజూ రమ్యకు ఫోన్‌చేస్తూ " రమ్యా ఒంట్లో ఎలావుంది. నువ్వేమాత్రం కదలకు, మెదలకు, మంచం దిగకు, కాలు తీసి కాలు కిందకు పెట్టకు. విటమిన్ ఫుడ్ మాత్రమే తీసుకో. మూడు పూటల పళ్ళరసాలు తాగుతూ బలానికి టానిక్ పుచ్చుకో" అంటూ శ్రీకాంత్ ఇంట్లో సమస్తసౌకర్యాలు పొందమని ఉచితసలహాలిస్తు కలలు కనసాగాడు.

" రమ్యకు తొమ్మిదోనెల నిండాక పండింటి అబ్బాయిని కంటుంది. రెండు నెలల్లోనే పేరు పెట్టేసి బారసాల ఘనంగా చేయించుకుంటుంది. పిల్లాడ్ని వాళ్ళ పోషణకే వదిలేస్తానంది. ఖర్చులకు, సర్వెంట్ మెయిడ్‌కి నెలకో ఐదువేలు గుంజుతానంది. అంతేనా మనవడు పుట్టాడన్న సంతోషంలో త్రీ బెడ్‌రూమ్ అపార్ట్‌మెంట్ కొనిచ్చేదాకా ఇంటి గుమ్మం దాటనంది. ఇదంతా రమ్య పన్నిన పన్నాగం, కలిసొచ్చిన అదృష్టం. ఏ జన్మలో చేసుకున్న పుణ్యఫలమోనని" శ్రీకాంత్ ఆనందడోలికల్లో ఊగాడు.

ఆ రోజు రానే వచ్చింది.

ఫోన్ కోసం ఎదురుచూసి చూసి చివరికి విసుగుపుట్టి తనే ఫోన్ చేశాడు.

రమ్య ఇంట్లో పనిమనిషి ఫోన్ ఎత్తింది.

"అమ్మగారు, అయ్యగారు రమ్యమ్మ గార్ని తీసుకుని ఆసుపత్రికి వెళ్ళారయ్యా, మళ్లీ ఫోన్ చేయండయ్యా " అని ఫోన్ పెట్టేసింది.

శ్రీకాంత్‌కి మనసులో మనసులేదు. ఒకటే ఆరాటం,ఆందోళన, ఆడపిల్లా, మగపిల్లాడా, ఏదో ఒకటి మరో పావుగంటపోయాక మళ్ళీ చేశాడు. ఇంకా రాలేదని చెప్పింది. విసుగుపుట్టిన కొంతసేపటికి శ్రీకాంత్‌కే ఫోన్ వచ్చింది.

అత్తగారి గొంతుక వినిపించింది ఆందోళనతో...

" బాబూ రమ్యకి అబ్బాయి పుట్టాడు కానీ.... "

" ఆహా! వెరీగుడ్, రమ్య ఒంట్లో ఎలావుంది...."

" తనకేం  బాగానే వుంది. కానీ మేజర్ ఆపరేషన్ చేశారు బాబు"

"అరరే ఎంత పనైంది, నేను ఇప్పుడే బయలుదేరి వస్తున్నాను"

ఆదుర్దాగా పలికాడు శ్రీకాంత్.

" ఆ! వెంటనే  రా బాబు, డెలివరీలోనే బిడ్డపోయాడు సారీ"

సారీ అంటూ  వెక్కివెక్కి ఏడ్చింది అత్తగారు. ఈ హఠాత్పరిణామానికి  శ్రీకాంత్ హతాశుడైపోయాడు.

(విధివిలాసం-డిసెంబర్, 2005)